సాక్షి
కామారెడ్డి
గురువారం । 10 । అక్టోబర్ । 2024



భావితరాలకు చరిత్ర..

భావితరాలకు చరిత్ర వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు అన్నారు.

- 11లో ▸



నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

సద్దుల బతుకమ్మ సందర్భంగా చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
36.3 /21.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఇద్దరు సీసీల సస్పెన్షన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు సీసీలను అధికారులు సస్పెండ్ చేశారు. బ్యాంకు లింకేజీ రుణాల టార్గెట్‌లో వెనుకబడడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో జుక్కల్‌కు చెందిన సీసీ హన్మాండ్లు, పిట్లం మండలానికి చెందిన సీసీ శాంతలను సస్పెండ్ చేస్తూ డీఆర్డీవో సురేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏపీడీ మురళి కృష్ణ, డీపీఎం రవీందర్‌రావుకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మద్నూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మద్నూర్ తహసీల్ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. 2021 అక్టోబర్ 31కి ముందు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

కుక్కల బెడద నివారణకు చర్యలు




బిచ్కుంద: జుక్కల్ నియోజకవర్గంలో కుక్కల బెడద అధికంగా ఉందని, నివారణకు చర్యలు తీసుకుంటామని డీపీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇందులో భాగంలో కుక్కల సంతానోత్పత్తి నివారణ కేంద్రం (ఏబీసీ) నిర్మాణానికి మండలంలోని గోపన్‌పల్లి శివారులో బుధవారం డీపీవో స్థలం పరిశీలించారు. ఐదు గుంటల స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. జిల్లా కుక్కల బెడద ఎక్కువగా జుక్కల్ నియోజకవర్గంలో ఉందని, దీంతో బిచ్కుందలో ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం బిచ్కుంద గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆర్ఐ రవీందర్, ఎంపీవో అబ్బాగౌడ్, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



రాజంపేట: పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ సింధుశర్మ సూచించారు. బుధవారం రాజంపేట పోలీస్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు, భిక్కనూర్ సీఐ సంపత్, ఎస్సై పుష్పరాజ్ పాల్గొన్నారు.

సాగర్‌లోకి 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువ నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఐదు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. బుధవారం ప్రాజెక్టు ఒక వరద గేటు ద్వారా ఐదు వేల క్యూసెక్కుల నీటిని మంజీరలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగులు (17.80 టీఎంసీలు) కాగా ప్రస్తుతం1405 అడుగుల (17.68 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

'ఓపెన్' ప్రవేశాల గడువు పెంపు

బాన్సువాడ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో చేరడానికి గడువును ఈనెల 15వరకు పెంచినట్లు బాన్సువాడలోని అధ్యయన కేంద్రం సమన్వయకర్త వేణుగోపాల్ తెలిపారు. 2023, అంతకన్నా ముందు డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్న వారు రెండు, మూడో సంవత్సరానికి రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు అధ్యయన కేంద్రంలో సంప్రదించాలన్నారు.



ప్రజలతో కిటకిటలాడుతున్న కామారెడ్డిలోని సుభాష్ రోడ్డు

'సద్దుల'కు వేళాయే..

సద్దుల సంబరానికి అంతా సిద్ధమైంది. ఎనిమిది రోజుల పాటు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ ఆడిన ఆడబిడ్డలు నేడు పెద్ద బతుకమ్మ ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేసి పోయి రా గౌరమ్మ అంటూ వీడ్కోలు పలకనున్నారు.

నేడు పెద్ద బతుకమ్మ
- ఊరూరా ఆడి పాడనున్న ఆడబిడ్డలు
- పూల వేడుకకు అంతా సిద్ధం
- నిమజ్జనానికి ఏర్పాట్లు చేసిన అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రపంచమంతా పూలతో దేవుడిని పూజిస్తే, ఆ పూలనే పూజించే అరుదైన సంస్కృతికి నిదర్శనమే బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. చివరి రోజున సద్దుల బతుకమ్మ (పెద్ద బతుకమ్మ) పండుగను గురువారం ఊరూరా జరుపుకోనున్నారు. తరతరాలుగా బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తంగేడు పువ్వు, గునుగు పువ్వులతో పాటు రకరకాల పువ్వులను తీసుకువచ్చి తాంబుళంలో పేర్చి పూజిస్తారు. పల్లెలతో పాటు పట్టణాల్లోనూ బతుకమ్మలను భారీ సైజుల్లో పేర్చి కూడళ్ల వద్ద, ఆలయాల వద్ద తీసుకువస్తారు. కొత్త బట్టలు ధరించిన మహిళలు ఉత్సాహంగా పాటలు పాడుతూ బతుకమ్మ ఆడుతూ తమ ఆనందాన్ని పంచుకుంటారు. ఆట ముగిసిన అనంతరం బతుకమ్మలను చెరువు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకుని వెంట తీసుకెళ్లిన సద్దులు తింటారు. కాగా బతుకమ్మ పండగ సీజన్ వచ్చిందంటే చాలూ ఇంటింటా సందడి కనబడుతుంది.



కామారెడ్డిలో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



కాగితపూల బతుకమ్మల విక్రయాలు

పూలు తెచ్చి..

గ్రామీణ ప్రాంతాల్లో బతుకమ్మను తయారు చేయడానికి అవసరమైన తంగేడు, గునక పువ్వులను రెండు రోజుల ముందే అడవులు, చేలకు వెళ్లి తీసుకువస్తారు. కొన్ని చోట్ల తంగేడు పువ్వు కరువైంది. ఎక్కడ దొరికితే అక్కడికి వెళ్లి తీసుకువస్తారు. పట్టణ ప్రాంతాల్లో మార్కెట్‌కు వెళితే చాలు కావలసిన పువ్వులన్నీ దొరుకుతాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో తంగేడు, గునక పువ్వు పెద్ద మొత్తంలో విక్రయించారు. దీంతో పట్టణ ప్రజలే కాకుండా ఇరుగు పొరుగు ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేశారు. తంగేడు, గునక పువ్వు దొరకని వారు బంతిపూలతో బతుకమ్మలను పేరుస్తున్నారు. పండగ రోజున ఉదయమే స్నానమాచరించి బతుకమ్మలను పేర్చడం మొదలుపెడతారు. కొందరు ఎత్తుగా పేర్చడానికి ప్రయత్నిస్తారు. ఊళ్లో తమ బతుకమ్మనే ఎక్కువ ఎత్తుది ఉండేలా పోటీ పడుతుంటారు.

మార్కెట్‌లో సందడి

కామారెడ్డి టౌన్: సద్దుల బతుకమ్మ పండుగ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం సందడి నెలకొంది. పట్టణంలోని సుభాష్‌రోడ్, జేపీఎన్‌రోడ్, మాయాబజార్ ప్రజలతో కిటకిటలాడాయి. గునక, తంగేడు పూల విక్రయాలు జోరుగా సాగాయి. కాగితపు పూల బతుకమ్మలను కూడా పలువురు కొనుగోలు చేశారు. పండుగ నేపథ్యంలో వ్యాపారులు పూల ధరలు పెంచారు.



కుటుంబం కోసం మహిళలు కష్టపడాలి

- బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: కుటుంబం, పిల్లల భవిష్యత్తు కోసం ప్రతీ మహిళా కష్టపడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. అనంతరం ఉత్తమ మహిళా సంఘాలకు కలెక్టర్ బహుమతులను అందించారు. భిక్కనూర్ మండలం మహిళా సంఘం మొదటి, మాచారెడ్డి మహిళా సంఘం ద్వితీయ, సదాశివనగర్ సంఘం తృతీయ బహుమతులు సాధించాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, సీపీవో రాజారాం, జిల్లా సంక్షేమ అధికారి బావయ్య, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు రాజమణి, డీపీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ సంగ్వాన్



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు, సిబ్బంది

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి

కామారెడ్డి టౌన్: పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటి పారుదల శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే వారం మళ్లీ సమావేశం ఏర్పాటు చేస్తామని, అప్పటిలోగా క్షేత్ర పర్యటనలు చేసి పురోగతి కనబరచాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఆర్డీవోలు రంగనాథ్ రావు, ప్రభాకర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా సంక్షేమ అధికారి బావయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



జగన్మాతా పాహిమాం

తాడ్వాయి: జిల్లావ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారికి బుధవారం భక్తులు పూజలు చేశారు. తాడ్వాయి మండలం ఎండ్రియాల్‌లో దుర్గామాత మండపాన్ని రూ.18.76 లక్షలతో అలంకరించారు.

'భరోసా' ఏదీ?

- వానాకాలం సీజన్ ముగుస్తున్నా అందని పెట్టుబడి సాయం
- విధివిధానాల పేరిట సర్కార్ కాలయాపన



కామారెడ్డి క్రైం: వానాకాలం సీజన్ పూర్తి కావొచ్చింది. ఇప్పటికీ సీజన్ ప్రారంభంలో అందాల్సిన పెట్టుబడి సాయం అందలేదు. పథకం అమలులో వృథాను అరికట్టి, సాగులో ఉన్న భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీని కోసం క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు, క్షేత్రస్థాయిలో భూముల పరిశీలన, రైతుల అభిప్రాయ సేకరణ, జిల్లాల్లో వర్క్‌షాప్‌ల నిర్వహణ లాంటి కార్యక్రమాలు అన్నీ పూర్తయ్యాయి. అయినా సర్కారు వైపు నుంచి రైతు భరోసాపై ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురి చేస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చింది. ఈ పథకం అమలులో అనేక తప్పిదాలున్నాయనీ, మార్పులు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావించింది. ఇందు కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఉమ్మడి జిల్లాల స్థాయిలో జూలైలోనే ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులు ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు, సూచనలను సేకరించింది. మరో వైపు వ్యవసాయ అధికారులు సాగుకు పనికిరాని భూముల వివరాలను గుర్తించి నివేదిక పంపించారు. ఆగస్టు నాటికే ఈ ప్రక్రియ పూర్తయింది. అయినా ఇంతవరకు రైతు భరోసాపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

స్పష్టత లేక సందేహాలు

తాము అధికారంలోకి రాగానే ఎకరానికి ఏడాదికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. గత యాసంగి సమయంలోనే కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగా అప్పటికే సీజన్ ప్రారంభం కావడం, నిధుల కొరతతో పాత పద్ధతిలోనే పథకాన్ని కొనసాగించారు. ఖరీఫ్ నుంచి మాత్రం తప్పకుండా ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పథకంలో మార్పులకు అవసరమైన సర్వేలు, సమావేశాలు, అభిప్రాయ సేకరణలు పూర్తయి నెలలు గడుస్తున్నా అమలుపై స్పష్టత రావడం లేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రుణమాఫీ కూడా దాదాపు సగం మంది రైతులకు రాలేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో మొదట రుణమాఫీ చేస్తారా, లేక రైతు భరోసా అమలు చేస్తారా అనే సందేహాలు సైతం రైతుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

పెట్టుబడికి తప్పని తిప్పలు

జిల్లాలో 5,13,752 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. మొత్తం 3,04,804 మంది అర్హులైన రైతులున్నారు. గతంలో పెట్టుబడి సాయం జమ చేయడానికి జిల్లాకు దాదాపు రూ.270 కోట్ల వరకు నిధులు అవసరం ఉండేవి. ఎకరానికి రై.15 వేల చొప్పున ఇవ్వాల్సి వస్తే మరిన్ని నిధులు అవసరం ఉండవచ్చు. జూన్‌లో అందాల్సిన పెట్టుబడి సాయం సీజన్ పూర్తయినా అందకపోవడం రైతులను ఇబ్బందులకు గురి చేసింది. రైతు భరోసాపై ఎలాంటి ప్రకటన, స్పష్టత లేకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. పంటల సాగులో పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

ఉత్తర్వులు రాలేదు

రైతు భరోసాకు సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. రైతుల వివరాలు సిద్ధంగా ఉన్నాయి. విధి విధానాలు, నిధులు విడుదల కాగానే అర్హులైన ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందేలా చర్యలు తీసుకుంటాం. – తిరుమల ప్రసాద్, డీఏవో, కామారెడ్డి

ఆదమరిస్తే అంతే!

- బ్యాంకుల వద్ద కాపుకాస్తున్న ఆగంతకులు
- డబ్బులు తీసుకు వెళ్తుంటే లాక్కెళ్తున్న వైనం

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు నుంచి అక్కంపల్లి గ్రామానికి చెందిన జక్కుల రాములు రూ.85 వేలు డ్రా చేసుకుని ఆటోలో తన ఊరికి బయలుదేరాడు. ఆటో దిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా బైక్‌పై వచ్చిన దుండగులు రాములు చేతిలో నుంచి డబ్బుల కవర్‌ను లాక్కొని పరారయ్యారు.

బాన్సువాడలో సమీరొద్దిన్ అనే వ్యక్తి బ్యాంకులో రూ.లక్ష డ్రా చేసుకుని బైకులో పెట్టి పాల కేంద్రంలోకి వెళ్ల వచ్చేసరికి డబ్బులు మాయమయ్యాయి. బ్యాంకులో డబ్బులు తీసుకున్నపుడు గమనించిన దుండగులు ఆయన్ను అనుసరించి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు భావిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బ్యాంకులో డబ్బు డ్రా చేసుకొని వెళ్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని ఇటీవల దొంగలు రెచ్చిపోతున్నారు. డబ్బు తీసుకొని బయటకు రాగానే వారిని అనుసరిస్తూ వారు ఆదమరవగానే లాక్కొని పారిపోతున్నారు. డబ్బులను తీసుకువెళ్లే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో తమ దగ్గర డబ్బులు ఉన్న విషయంలో రెండో కంటికి తెలియకుండా జాగ్రత్తపడేవారు. ఇటీవలి కాలంలో చాలా మంది బ్యాంకుల్లో డబ్బులు డ్రా చేయడానికి వెళ్లటపుడు కనీసం వెంట ఒక బ్యాగును కూడా తీసుకువెళ్లడం లేదు. బ్యాంకు క్యాషియర్ నోట్ల కట్టలను తీసి ఇవ్వడంతో చేతుల్లోనే పట్టుకుని వెళ్లేవారు చాలా మంది ఉన్నారు. రూ.లక్షలు కూడా చేతుల్లో పట్టుకుని వెళ్లి బైకు కవర్‌లో, బైకు బాక్సుల్లో పెడతారు. మరికొందరు కట్టలను తీసి కార్లలో వేసుకుంటారు. ఏదో ఫోన్ రావడంతో ఫోన్ మాట్లాడడం, అదే సమయంలో గమనించిన ఆగంతులకు డబ్బులు మాయం చేయడం క్షణాల్లో జరిగిపోతోంది. మరికొన్ని సంఘటనల్లో డబ్బులను పట్టుకుని వెళ్లేటపుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం మూలంగా అగంతకులు వెంబడించి డబ్బుల మూటలను లాక్కొని పారిపోతున్నారు. పాతతరం వాళ్లయితే డబ్బులు తీసుకువెళ్లే విషయం రెండో కంటికి తెలియకుండా జాగ్రత్త పడతారు. అవసరమైతే ఎవరినో ఒకరిని వెంట తీసుకువెళ్లి డబ్బులతో జాగ్రత్తగా ఇంటికి చేరే ప్రయత్నం చేస్తారు.



అనుమానం వస్తే..

బ్యాంకులో డబ్బులు తీసే సమయంలో, బయటకు వెళుతున్నప్పుడు ఎవరైనా అనుసరిస్తున్నట్లు అనుమానం వస్తే అప్రమత్తం కావాలి. అపరిచితులు తమను ఫాలో అవుతున్నారంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కష్టపడి సంపాదించిన డబ్బు పోయిన తర్వాత బాధపడే బదులు ముందే జాగ్రత్తలు తీసుకోవాలి.

జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

బ్యాంకుకు వెళ్లి పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా చేసినపుడు వెంట ఎవరినైనా తీసుకువెళ్లాలి. డబ్బులను పెట్టుకోవడానికి బ్యాగులు తీసుకువెళితే ఏ ఇబ్బంది ఉండదు. పాలిథీన్ కవర్లలో నగదు పెడితే అవి బయటకు స్పష్టంగా కనబడుతాయి. వెంట డబ్బులు ఉన్నంత సేపు జాగ్రత్తగా ఉండాలి.

పంట కోతలు షురూ

నిజాంసాగర్: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి పంటలు కోతకు వచ్చాయి. దీంతో పలు గ్రామాల్లో పంట నూర్పిడీ ప్రారంభించారు. హార్వెస్టర్‌లతో కోతలు చేపడుతున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 3.4 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ముందుగా సాగు చేసిన వరి పొలాలు కోతకు రావడంతో వారం రోజుల నుంచి గ్రామాల్లో వరి పంట నూర్పిడీల సందడి నెలకొంది. మరోవైపు వర్షాలు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



హసన్‌పల్లి శివారులో వరి పంట కోస్తున్న హార్వెస్టర్

క్లుప్తంగా

సామాన్యులకు వజ్రాయుధం ఆర్టీఐ



నిజామాబాద్‌నాగారం: సామాన్యులకు ఆర్టీఐ వజ్రాయుధం వంటిదని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. సమాచార హక్కు చట్టం నూతన కార్యవర్గాన్ని నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం వచ్చి 19 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షి వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రతి పౌరుడు వినియోగించుకోవాలని సూచించారు.

నూతన కమిటీ..

జిల్లా అధ్యక్షుడిగా కాంతపు గంగాధర్, ఉపాధ్యక్షుడిగా ముత్తన్నపల్లి నాగరాజు, మహిళా ప్రధాన కార్యదర్శిగా స్వప్న, సెక్రెటరీగా మహ్మద్‌ఖాన్, జాయింట్ సెక్రెటరీగా పి చంద్రశేఖర్, మంగోలి ఎల్లయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చింత రాజేందర్ ఎన్నికయ్యారు. అలాగే గతంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన ఆదె ప్రవీణ్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. గతంలో సమాచార హక్కు చట్టం 2005పై అనేక కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేసిన ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేసి సన్మానించారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్: జవహర్ నవోదయలో ప్రవేశం కోసం దరఖాస్తు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 విద్యాసంవత్సరానికి ఖాళీగా ఉన్న తొమ్మిదో తరగతి సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన ఉంటుందని, మిగతా వివరాలకు 97019 07749 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తహసీల్ కార్యాలయం తనిఖీ

పిట్లం: మండల తహసీల్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ తొందరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ శీతల్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వాహనాలు..

కామారెడ్డి టౌన్: పట్టణంలోని టేక్రియాల్ చౌరస్తా వద్ద వా హనాల తనిఖీ చేపట్టినట్లు కామారెడ్డి రూరల్ సీఐ రామన్ బుధవారం తెలిపారు. నిబంధనలు పాటించకుండా, నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న ఆరు బైక్‌లను పోలీసులు సీజ్ చేశారు. తనిఖీల్లో ఎస్సై రాజు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రసాభాసగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం
- ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలు



ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతుండగా వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు

వేల్పూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదానికి దారితీసింది. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము అధికారంలోకి రాగానే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఆర్థికసాయంతోపాటు తులం బంగారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు ఇవ్వడం లేదన్నారు. లబ్ధిదారులకు ఆర్థికసాయంతోపాటు తులం బంగారం ఇవ్వాలని కోరారు. తులం బంగారం కావాలన్న వారు చేతులెత్తాలని ఎమ్మెల్యే కోరగా.. చెక్కుల కోసం వచ్చిన మహిళలు చేతులెత్తారు. పక్కనే ఉన్న ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి కల్పించుకుని.. ఇప్పుడు ఇస్తున్న చెక్కులు ఎన్నికలకు ముందు దరఖాస్తు చేసుకున్న వారివని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి కచ్చితంగా తులం బంగారం ప్రభుత్వం ఇస్తుందని చెబుతుండగానే రెండు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక దశలో కొందరు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగగా, వారిని ఎమ్మెల్యే వారించారు. ఓవైపు వాగ్వాదం కొనసాగుతుండగా ఎమ్మెల్యే ప్రసంగాన్ని కొనసాగించి, లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్ చైర్మన్ నర్సారెడ్డి, తహసీల్దార్ సంతోష్, పడగల్, రామన్నపేట్, మోతె సొసైటీల చైర్మన్లు హన్మంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులను ప్రశ్నించిన మహిళలు

తమ కూతుళ్లకు ఎన్నికల తరువాతే పెళ్లిళ్లయ్యాయని, వారికి తులం బంగారం ఎందుకు ఇవ్వడం లేదని మహిళలు ప్రశ్నించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివాహం చేసుకున్న వారికి తప్పకుండా తులం బంగారం ఇస్తుందని, దానికి తాము గ్యారంటీ అని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

నిజామాబాద్ సిటీ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ సందర్భంగా మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తూ.. తులం బంగారం ఏదీ అని ఎమ్మెల్యే మాట్లాడడం సరికాదని హితవుపలికారు. తప్పుడు ఆరోపణలు చేస్తే ఎక్కడికక్కడే నిలదీయాలని కాంగ్రెస్ శ్రేణులకు మానాల పిలుపునిచ్చారు.

ఒకేసారి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అక్కాచెల్లెళ్లు



అక్కాచెల్లెళ్లు ప్రవళిక, శ్రావన

నందిపేట్(ఆర్మూర్): అక్కాచెల్లెళ్లు ఒకేసారి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. చిన్ననాడే తన తల్లిని కోల్పోయిన వారు ఆత్మవిశ్వాసంతో చదువులో రాణించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నందిపేట మండల కేంద్రానికి చెందిన ఎడ్డిగారి పోశెట్టి, లలిత దంపతులకు ప్రవళిక, శ్రావన కూతుళ్లు. 20 ఏళ్ల క్రితం లలిత విద్యుత్‌ప్రమాదంలో మృతి చెందగా, పోశెట్టి తన ఇద్దరు కూతుళ్లను పెంచి పెద్దచేసి ఉన్నత చదువులు చదివించాడు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ(ఎస్జీటీ)లో ప్రవళిక 112వ ర్యాంకు, శ్రావన 162వ ర్యాంకు పొంది టీచర్ ఉద్యోగాన్ని సాధించారు. బుధవారం హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందుకున్నారు.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



దేవేందర్

మోర్తాడ్: కృషి, పట్టుదలతో మోర్తాడ్‌కు చెందిన యువకుడు చెట్లపల్లి దేవేందర్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. దేవేందర్ 2018–19లో బెటాలియన్ కానిస్టేబుల్‌గా ఎంపికై విధులు నిర్వర్తిస్తూనే 2023–24లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణ పొందుతున్నాడు. అంతలోనే టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో ప్రతిభ కనబర్చి ఎస్జీటీగా ఎంపికయ్యాడు. దేవేందర్‌ను స్థానికులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బోధన్/బోధన్‌రూరల్: బోధన్ మండలం పెంటా ఖుర్దు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999 -00 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తమ ఎస్సెస్సీ పూర్తయి 25 ఏళ్లైన (సిల్వర్ జూబ్లీ) సందర్భంగా సాలూర మండలం కొప్పర్తి గ్రామ శివారులోని తిరుపతమ్మ కళ్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ప్రముఖ మెజీషియన్ యుగేంధర్‌తో మ్యాజిక్ షో ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం కో ఆర్డినేటర్లు భాస్కర్(మీ సేవ), విఠలేశ్వర్, రామకృష్ణ, రేణుక, జ్యోతి మాట్లాడుతూ..పాఠశాల అభివృద్ధికు తమ వంతు సహకారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. అప్పటి ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, దుర్గారావు, రామారాజు, బాల త్రిపురాదేవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సేఫ్టీ మోకుల పంపిణీ



నిజామాబాద్‌అర్బన్: కల్లు గీత కార్మికులకు రెండో విడత సేఫ్టీ మోకులను బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో ఈడీ రమేశ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కల్లు గీతకార్మిక సంఘం నాయకులు పెద్ది వెంకట్‌రాములు, కోయాడ నర్సింలుగౌడ్ మాట్లాడుతూ.. గీత వృత్తిదారుల రక్షణకు సేఫ్టీ మోకులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం నాయకులు శ్రీరామ్‌గౌడ్, సిడుగు శేఖర్‌గౌడ్, కోయాడ నర్సింలుగౌడ్, అధికారులు నర్సయ్య, శ్రీనివాస్, జయలలిత, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ స్థలం పరిశీలన



డొంకేశ్వర్(ఆర్మూర్): నగర శివారులోని మౌజం కాలనీ, పెయింటర్ కాలనీ, బాబన్ సహాబ్ పహాడి ప్రాంతాల్లో ఫారెస్ట్ భూమి కబ్జాకు గురవుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సయ్యద్ కై సర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అటవీ శాఖ అధికారులు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఫారెస్టు హద్దు లోపల నివాసాలు ఏర్పర్చుకున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే రెవెన్యూ అధికారులు తమకు పట్టాలిచ్చారని స్థానికులు కాగితాలను చూపించారు. వారితో మాట్లాడిన ఎఫ్‌ఆర్వో సంజయ్‌గౌడ్ వివరాలు సేకరించారు. అటవీ స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని, రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టాలను పరిశీలించి అవి నిజమైనవో కాదో తెలుసుకునేందుకు తహసీల్దార్‌కు లేఖ రాస్తామని తెలిపారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో సెక్షన్ ఆఫీసర్లు ప్రతాప్, గంగారెడ్డి, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



చీరలను పరిశీలిస్తున్న మహిళ

నిజామాబాద్ రూరల్: చేనేత వస్త్రంపై మనసు పడని మగువలు ఉండరు. అందం.. హుందాతనం కలగలిపిన ఆధునిక సొబగులద్దుకుంటున్న సంప్రదాయ హస్తకళను నిజామాబాద్ ప్రాంతవాసులకు చేరువ చేసేందుకు కళాసిల్క్ సంస్థ శ్రీకారం చుట్టింది. ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘం కళ్యాణ మండపంలో చేనేత వస్త్ర, హస్తకళ ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను సంస్థ ఏర్పాటు చేసింది. నేతన్నలకు ఆర్థికంగా చేయూత అందించడంతోపాటు చేనేత హస్తకళను ప్రతి ఇంటికీ చేర్చేందుకు సంస్థ నిర్వాహకులు కృషి చేస్తున్నారు. దేశంలో ఎంపికైన చేనేత కళాకారులు అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి.

ఎగ్జిబిషన్‌లో పలు రాష్ట్రాల ఉత్పత్తులు

తెలంగాణలోని గద్వాల్, నారాయణపేట, పోచంపల్లి, ఏపీలోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాంలోని మూగా, గుజరాత్‌లోని బాందని, కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్, శారీస్, జమ్ముకశ్మీర్‌లోని ఎంబ్రాయిడరీ శారీస్, డ్రెస్ మెటీరియల్, పాస్మిక్ శాల్, కర్నాటకలోని క్రేప్, ప్రింటెడ్ శారీస్, మధ్యప్రదేశ్‌లోని చందేరి, మహేశ్వరి, రాజస్థాన్‌లోని కోటా, బంధాని, బ్లాక్ ప్రింట్, సంగ్నరి ప్రింట్, ఉత్తరప్రదేశ్‌లోని జమ్దాని, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్‌తోపాటు హరియానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నో కుర్తీస్, డోర్ కర్టెన్స్, చుడీదార్స్, సూటింగ్స్ షర్టింగ్స్, జ్యూయెల్లరీ తదితర రాష్ట్రాల హ్యాండీ క్రాఫ్ట్స్, న్యూట్రిషియన్ ఫుడ్ విక్రయిస్తున్నారు.



ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో ఏర్పాటుచేసిన చేనేత, హస్తకళ స్టాళ్లు

శిక్షణకు వెళ్లిన సీడ్స్, పెస్టిసైడ్స్ డీలర్లు



శిక్షణలో పాల్గొన్న జిల్లాకు చెందిన విత్తన, ఎరువుల డీలర్లు

డొంకేశ్వర్(ఆర్మూర్): డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ టు ఇన్‌పుట్ డీలర్స్(డీఏఈఎస్ఐ) శిక్షణ కార్యక్రమంలో భాగంగా అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన విత్తన, ఎరువులు, పురుగుమందుల డీలర్లు బుధవారం హైదరాబాద్‌కు వెళ్లారు. పటాన్ చెరువులోని ఇక్రిశాట్ పరిశోధన కేంద్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా మూల విత్తనాలు, వర్షపు నీటిని పంటలకు అదించే విధానం,ఐ హబ్ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఏఈఎస్ఐ ఫెసిలిటేటర్ అమరేశ్ కుమార్, ఆత్మ బీటీఎం భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనోవేదనతో వివాహిత ఆత్మహత్య

బోధన్‌రూరల్ : పెళ్లై 15 ఏళ్లవుతున్నా పిల్లలు కలగడం లేదనే మనోవేదనతో కోట్‌పల్లి లక్ష్మి(35) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణ శివారులోని నర్సాపూర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళకు ఊట్‌పల్లి గ్రామానికి చెందిన రవితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. సంతానం కాకపోవడంతో తీవ్రమనోవేదనకు గురవుతున్న లక్ష్మి ఈ నెల2వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబసభ్యులు ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

భర్తతో గొడవపడి..

కామారెడ్డి క్రైం: డబ్బుల విషయంలో భర్తతో గొడవపడిన భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జిల్లా కేంద్రంలోని గోదాం రోడ్డు కాలనీలో బుధవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాలనీకి చెందిన షేక్ సల్మా (37)కు భర్త ఇంతియాజ్‌తో డబ్బుల విషయంలో కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన సల్మా ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దాబా హోటళ్లపై దాడులు

బిచ్కుంద: మండల కేంద్రంలోని దాబా హోటళ్లపై పోలీసులు మంగళవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. నేషనల్ ఎస్‌ఎన్‌పీ రోడ్డుపై గుండా ఉన్న దాబాలపై దాడులు చేసి మద్యం సిట్టింగ్ నిర్వహిస్తున్న వాటిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. దాబాల్లో ఎవరైనా మద్యం సెట్టింగ్ ఏర్పాటు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

నేడు శాంతికమిటీ సమావేశం

సదాశివనగర్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొల్పిన దుర్గామాత మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండపాల నిర్వాహకులు ఉదయం 11 గంటలకు పీఎస్‌లో హాజరు కావాలని కోరారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో ప్రభుత్వ ఉద్యోగి మృతి



అనిల్ (ఫైల్)

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి అనిల్(35) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందారు. తహసీల్ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వర్తించిన అనిల్ ప్రమోషన్‌పై సంవత్సరం క్రితం ములుగు మెడికల్ కళాశాలకు వెళ్లాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఆయన.. దసర సెలవుల కోసం బిచ్కుందకు వచ్చాడు. స్నేహితులతో కలిసి విందు చేసుకోవడానికి రాత్రికి దాబా హోటల్‌కు వెళ్లగా, అక్కడే గుండెపోటు రావడంతో కుప్పకూలి ఆస్పత్రికి తరలించే లోగా మృతి చెందాడు.

అనారోగ్యంతో కానిస్టేబుల్..



రామన్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ ధర్పల్లి రామన్ బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. రామన్ మృతికి జిల్లా ఎస్పీ సింధూశర్మ సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియల నిమిత్తం జిల్లా పోలీసు శాఖ తరఫున రూ. 20 వేలు అందజేశారు. 1992లో పోలీసు శాఖలో నియమితులైన రామన్.. జిల్లా పోలీసు శాఖకు ఎనలేని సేవలను అందించారని, రామన్ మరణం వారి కు టుంబంతోపాటు పోలీసు శాఖకు తీరని లోటని ఎస్పీ అన్నారు. పోలీసు శాఖ తరఫున రామన్ కుటుంబానికి అందాల్సిన అన్ని బెనిఫిట్స్ సకాలంలో అందే విధంగా చూస్తామని, పోలీసుశాఖ ఎల్లవేళలా ఆ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు.

బొమ్మాబొరుసు ఆడుతున్న వారిపై కేసు



పోలీసుల అదుపులో నిందితులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి అటవీ ప్రాంతంలో బుధవారం బొమ్మాబొరుసు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. శెట్పల్లిసంగారెడ్డి అటవీ ప్రాంతంలో కొంత మంది బొమ్మాబొరుసూ ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.7,700 నగదు, ఆరు బైకులు, ఐదు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదుచేశామన్నారు.

బైక్‌చోరీకి యత్నం.. పట్టివేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం గ్రామంలో ఓ ఇంటి ఎదుట నిలిపి ఉంచిన బైక్‌ను ఎత్తుకెళ్లేందుకు యత్నించిన యువకులను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి ముగ్గురు యువకులు బుధవారం తెల్లవారుజామున పోచారం గ్రామానికి చెందిన లక్ష్మణ్‌గౌడ్ ఇంటి ముందున్న బైక్‌ను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. గమనించిన గ్రామస్తులు ముగ్గురిని పట్టుకున్నారు. లక్ష్మణ్‌గౌడ్ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఉమేశ్ తెలిపారు. పట్టుబడిన యువకులు మొత్తం మూడు బైక్‌లను దొంగిలించే ప్రయత్నం చేశారని గ్రామస్తులు తెలిపారు.


దాడి కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: పాతకక్షల నేపథ్యంలో దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై యాసిన్ అరాఫత్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని బోయిగల్లీకి చెందిన అరుణ్ కుమార్ తన ఇంటిని వేరే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. రెండు రోజుల క్రితం అద్దె వసూలు చేసేందుకు వెళ్లగా ఆ ప్రాంతంలోనే ఉండే పల్లికొండ శివకుమార్ అనే వ్యక్తి పాతకక్షల దృష్టిలో పెట్టుకుని అతడిపై దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శివకుమార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పిట్లం(జుక్కల్): మండలంలోని సిద్దాపూర్ తండాకు చెందిన కేతావత్ రవి (37) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కేతావత్ రవి బుధవారం హైదరాబాద్ నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో గద్ద గుండు తండా శివారులోని జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న కారును ఢీకొని గాయాలు..



ఆస్పత్రిలో రమేశ్

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారును బైక్ ఢీకొన్న ఘటనలో తలారి రమేశ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పడకల్‌కు చెందిన రమేశ్ పని నిమిత్తం ఆర్మూర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. గాయాలపాలైన రమేశ్‌ను ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటనాస్థలాన్ని ఎస్సై తిరుపతి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మేక మృతి

బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామంలో కరెంట్ షాక్‌తో ఓ మేక మృతిచెందింది. పొలాల వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో మేతకు వెళ్లిన ముక్కెర అశోక్‌కు చెందిన మేక ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. సుమారుగా రూ.10వేల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

తాళాలు వేసిన ఇళ్లలో చోరీ



నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతినగర్ రోడ్డు నంబర్ 5లో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దసరా సెలవులు రావడంతో తక్కురి నర్సయ్య అనే వ్యక్తి మంగళవారం ఇంటికి తాళంవేసి తన స్వగ్రామమైన భీమ్‌గల్ మండలం చెంగల్‌కు వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు మూడు తులాల బంగారం, రూ.20వేల నగదును ఎత్తుకెళ్లారు. బుధవారం నర్సయ్య ఇంటికి వచ్చిన అతడి బావమరిది తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బాన్సువాడ పట్టణంలో..

బాన్సువాడ : తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని బండగల్లీలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. రెండు రోజుల క్రితం సమీ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. బుధవారం ఉదయం తిరిగివచ్చిన ఆయన.. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. దుండగులు బీరువాలోని తులన్నర బంగారం ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వరుస చోరీలు జరుగుతుండడంతో పట్టణ వాసులు భయాందోళనకు గురవుతున్నారు.



దుండగులు చిందరవందర చేసిన వస్తువులు

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండి



ఆర్మూర్‌టౌన్: ప్రయాణికులు ప్రయివేట్ వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీ బస్సుల్లో క్షేమంగా ప్రయాణించాలని జిల్లా రీజినల్ మేనేజర్ జానీరెడ్డి అన్నారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపోను బుధవారం ఆయన పరిశీలించారు. దసరా సందర్భంగా జేబీఎస్ నుంచి ప్రతిరోజు 10బస్సు లు ఆర్మూర్‌కు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ రవికుమార్ వివరించారు. ఎంఎఫ్ గంగాకిషన్ తదితరులు ఉన్నారు.

అమెరికాలో భగవద్గీతపై ప్రచారం



బోధన్: అమెరికా దేశంలోని జార్జియా అట్లాంటా నగర కేంద్రంలో బుధవారం బోధన్ ప్రాంతానికి చెందిన త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు ఆవుల వెంకట రమణ, ఆవుల వనజ, నాగలలిత, నాగ రుద్రల ఆధ్వర్యంలో బుక్‌స్టాల్ ఏర్పాటు చేసి భగవద్గీతపై దైవజ్ఞాన ప్రచారం చేశారు. ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత గ్రంథాల్లో దసరా పండుగ విశిష్టతలను తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాచారెడ్డి: ఆగి ఉన్న బస్సును ద్విచక్ర వా హనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పాల్వంచ మర్రి వద్ద బుధవారం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పా ల్వంచ మండలం మంథన్ దేవునిపల్లి గ్రామానికి చెందిన గుండెల్లి రాజనర్సు, పోచయ్యలు టీవీఎస్ ఎక్సెల్‌పై కామారెడ్డి వెళ్తూ పాల్వంచ మర్రివద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా, వారిని చికిత్స నిమిత్తం స్థానికులు కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు.



ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు